

నరసాపురంలో కారు తనిఖీ చేస్తున్న పోలీసులు

హరహర మహాదేవ !


గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయంలో దీపారాధన




ఆచంటేశ్వరునికి అభిషేకాలు

కార్తీకమాసం సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు శివనామ స్మరణతో మారుమోగాయి.. తెల్లవారుజాము నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పంచారామ క్షేత్రాలతో పాటు ప్రసిద్ధ ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. భీమవరం ఆనంద ఫంక్షన్ హాల్లో జ్ఞాన ప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివార్ల కల్యాణం, అనంతరం కార్తీక దీపోత్సవం నిర్వహించారు..






భీమవరం ఆనంద ఫంక్షన్ హాల్‌లో శ్రీకాళహస్తీశ్వరుని కల్యాణం

గొల్లలకోడేరులో అనంత దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

6

హై అలర్ట్

7

ఢిల్లీ బాంబు పేలుళ్ల నేపథ్యంలో అంతటా తనిఖీలు

వాళ్లు దెయ్యాలు.. అందుకే చంపేశా



భీమవరంలో తల్లి, తమ్ముడిని హతమార్చిన ఉన్మాది

మతిస్థిమితం లేకనే ఈ హత్యలు : ఎస్పీ

భార్య, మామ, బావమరిదిపై దాడి

ఆస్తి తగాదాలే కారణం

క్షతగాత్రులను 108లో ప్రైవేటు ఆస్పత్రికి తరలింపు




వృద్ధురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

సమస్యలు పరిష్కరిస్తేనే ప్రజలకు నమ్మకం : కలెక్టర్

భీమవరం టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అర్జీదారుడు సంతృప్తిచెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించినపుడే ప్రభుత్వ ఆధికారులపై ప్రజలకు విశ్వాసం కలుగుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కర వేదికలో సోమవారం ఆర్జీదారల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం కనిపిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రజలనుంచి 182 ఫిర్యాదులను స్వీకరించారు. డీఆర్వో శివన్నారాయణ రెడ్డి, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, డీపీవో రామనాధరెడ్డి, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కుష్ఠు బాధితుల గుర్తింపునకు ఇంటింటి సర్వే

ఇంటింటి సర్వేలో కుష్టువ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వారికి సకాలంలో చికిత్స అందించటం ద్వారా వ్యాధిని నిర్మూలించవచ్చునని కలెక్టర్ నాగరాణి అన్నారు. జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలనలో భాగంగా ఈనెల 17వ తేదీ నుంచి ఈనెల 30 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించే కుష్ఠువ్యాధి గ్రస్తుల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా అవగాహన పోస్టర్ కలెక్టర్ ఆవిష్కరించారు. చర్మంపై మెరిసే జిడ్డు గల చర్మం, చెవులు, వీపుపై, నొప్పిలేని బొడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవటం, ముక్కుదిబ్బడ,ముక్కులోంచి రక్తం కారటం, అరచేతులు, అరికాళ్ళు స్పర్శ కోల్పోవడం తదితర లక్షణాలు ఉంటే సర్వేకు వచ్చిన వారితో పరీక్షలు చేయించుకోవాలని కోరారు. జిల్లా వైద్యాధికారిణి గీతాబాయి, జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి సిహెచ్ రవిబాబు, డీపీవో ఎం.రామచంద్రా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా పరిష్కారం అందించాలి : ఎస్పీ



భీమవరం క్రైం, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇస్తూ అర్జీలు పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోగా చట్టపరిధిలో శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో 16 అర్జీలు స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అర్జీదారుల సమస్యలను చట్టపరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. అదనపు ఎస్పీ భీమారావు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చారు..చూశారు

తుఫాన్ నష్టంపై నారాయణపురంలో పరిశీలించిన కేంద్ర బృందం



ఏలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నష్టాలపై అంచనాకు వచ్చిన కేంద్రబృందం పరిశీలన కార్యక్రమం అరగంటలోనే ముగించేశారు. ఉంగుటూరు మండలంలో నారాయణపురం, ఉంగుటూరు గ్రామాల్లో పర్యటించాల్సినప్పటికి నారాణ యపురంతోనే సరిపెట్టేశారు. ఇక్కడ పొలాల్లోకి దిగి రైతుల నుంచి వివరాలను కేంద్ర వ్యవసాయశాఖ, రైతు సంక్షేమ శాఖ డైరెక్టర్ కె.పొన్నుస్వామి ఆధ్వర్యంలో సభ్యులు వాటర్ కమిషనర్ డైరెక్టర్ వాసు బాత్రి, కేంద్ర విద్యుత్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ ఆర్తిసింగ్, కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ అసి స్టెంట్ డైరెక్టర్ మనోజ్‌కుమార్ మీనాలు సేకరించారు. సాయంత్రం 4.20 గంటలకు జిల్లాకు బృందం రాగా 4.50కు తూర్పుగోదావరి జిల్లా గోపాలపురానికి పయనం అయ్యింది. నారాయణపురంలో గొట్టు ముక్కల సత్య నారాయణరాజు పొలంలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలించింది. వివరాలను అధికారులను అడిగి తెలుసుకు న్నారు. మొంథా తుఫాన్ కారణంగా ఏలూరు జిల్లాలో 72 కోట్ల రూపాయల మేర పంటలకు నష్టం వాటిల్లిందని 5,703 హెక్టార్లలో నష్టం వాటిల్లిందని,అధిక శాతం వరి పంట దెబ్బతిన్నట్టు కలెక్టర్ వెట్రిసెల్వి నివేదించారు.

17,000 ఇళ్లు రద్దు



తణుకులో లబ్ధిదారులకు పైడపర్రు అవతల సెంటు స్థలం వంతున ఇచ్చారు. అక్కడ ఏ ఒక్కరూ ఇళ్లు నిర్మించుకోవడానికి ఆసక్తి చూపలేదు. ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలన్న ఆప్షన్ పెట్టుకున్నారు. అయినా ఫలితం లేదు. కాంట్రాక్టర్‌లు కూడా ఇళ్లు నిర్మించ డానికి ముందుకు రాలేదు.. కొంతమంది రూ. 7 లక్షల వరకు వెచ్చించి ఇళ్లు నిర్మించుకున్నారు. కానీ చాలామంది అంత దూరం వెళ్లలేక ఇళ్లల్లోకి వెళ్లలేదు. అదిచూసి మిగిలిన వారు నిర్మించుకునే సాహసం చేయలేదు. ఇలా జిల్లాలో వేలాది ఇళ్లు నిర్మాణానికి నోచుకోలేదు. మంజూరైన ఇళ్లు పూర్తి చేయకపోతే కొత్తవి ఎలా ఇస్తామంటూ కేంద్రం ప్రశ్నిస్తోంది.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

- ఊరికి దూరంగా స్థలాలు
- మట్టికూడా పూడ్చలేని స్థితిలో లేఅవుట్‌లు
- వైసీపీ హయాంలో ఇచ్చిన స్థలాలతో లబ్ధిదారుల ఇబ్బందులు
- నిర్మాణాలకు వీలు కాదంటూ విముఖత
- కొత్తగా మంజూరు చేసే యోచనలో కూటమి ప్రభుత్వం

ప్రస్తుతం ప్రధానమంత్రి ఆవాస యోజన 2.0 అమలులోకి వచ్చింది. దానికి కారణం ఉంది. జిల్లాలో వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లు పూర్తయితేనే 2.0లో ఇళ్లు కేటాయిస్తామని కేంద్రం స్పష్టం చేసింది.కానీ జిల్లాలో గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లు పూర్తయ్యే పరిస్థితి లేదు. లబ్ధిదారులు ముందుకు రాలేదు. ప్రభుత్వం లేఅవుట్‌లు పూడ్చి ఇవ్వలేదు. మరోవైపు సచివాలయాల సిబ్బంది సర్వే చేశారు. ఇళ్ల నిర్మాణం చేపట్టకపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు.చివరకు జిల్లాలో 17 వేల మంది ఇళ్లు నిర్మించుకోలేని స్థితిలో ఉన్నారు. ఇప్పటికీ ప్రారంభించకపోయినా సరే మున్ముందు నిర్మించుకుంటామని చెప్పిన వారికి మాత్రం అవకాశం ఇచ్చారు. ఆసక్తి చూపని లబ్ధిదారుల పేర్లను మాత్రమే ఆన్‌లైన్ నుంచి తొలగించారు. మళ్లీ నిర్మించుకుంటామంటే ప్రభుత్వం మంజూరు చేస్తుందని అధికారులు చెపుతున్నారు. లేదంటే కొత్తగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జగన్ హయాంలో సేకరించిన భూములను ఏమి చేస్తారనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు. లేఅవుట్‌లు అలాగే ఉన్నాయి. మట్టి పూడ్చేందుకు అంత పెద్దమొత్తంలో సొమ్ము వెచ్చించే పరిస్థితి లేదు.

పేదలకు ఇళ్ల స్థలాల కోసమని వైసీపీ హయాంలో భీమవరం పట్టణంలో సేకరించిన స్థలం ఇది.. ఒకేచోట 84 ఎకరాలు కేటాయించారు. అందులో 3,500 మందికి సెంటు వంతున స్థలం కేటాయించారు. కానీ పూడిక చేయలేదు. వర్షాకాలం వస్తే చేపలు పట్టుకునే దుస్థితి. స్థలానికి చేరుకోవడానికి సరైన మార్గం కూడా లేదు.పూడిక చేయాలంటే కోట్ల రూపాయలు వెచ్చించాలి. వైసీపీ ప్రభుత్వం చేతులెత్తేసింది.లబ్ధిదారులకు స్థలాలు కూడా చూపించలేదు. దాంతో అక్కడ స్థలం పొందిన లబ్ధి దారులు ఇళ్లు నిర్మించుకునే పరిస్థితి లేదు.

పురోగతిలో ఉన్న ఇళ్లకు ప్రాధాన్యం

వైసీపీ హయాంలో జిల్లాలో దాదాపు 73,200 వేల ఇళ్లు కేటాయించారు. అందులో 56,210 ఇళ్లు మాత్రమే నిర్మాణానికి నోచుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే అత్యధికంగా ఇళ్లు పూర్తయ్యాయి.అసలు నిర్మాణానికి నోచుకోని ఇళ్లను మాత్రం ప్రభుత్వం రద్దు చేసింది. లబ్ధిదారుల పేర్లను ఆన్‌లైన్ నుంచి తొలగించింది. పురోగతిపై ఎప్పటికప్పుడు జిల్లా అధికారులు రాష్ట్ర - మిగతా 8లో..

పురోగతిలో ఉన్న ఇళ్ల పరిస్థితి ఇదీ..

నియోజకవర్గం	మొత్తం ఇళ్లు	పూర్తైనవి	నిర్మాణంలో ఉన్నవి	ప్రారంభం కానివి
ఆచంట	7,774	6,204	1482	88
భీమవరం	9,510	3,130	2,412	3,959
నర్సాపురం	6,037	3,700	1,372	965
పాలకొల్లు	5,689	3,994	1,319	376
తాడేపల్లిగూడెం	10,109	7,147	2,480	482
తణుకు	9,216	6,239	2,636	341
ఉండి	7,875	5,587	1,700	588

బోటు షికారు చేద్దామా !



భీమవరం పార్కుల్లో ఆహ్లాదానికి చర్యలు 6

రాజమండ్రి వరకు డెమో రైలు



రైల్వేకు కేంద్ర మంత్రి వర్మ ప్రతిపాదన

పాడి పెంపకానికి మంచిరోజులు వచ్చాయి. స్వచ్ఛమైన పాలు తాగేందుకు చాలామంది ఆసక్తి చూపడంతో రైతులకు పశువుల పెంపకం ఆదాయ మార్గంగా మారింది. దీంతో పల్లెల్లో పాడి పశువుల పెంపకం పెరుగుతోంది. పెంపకం భారమైనా గేదెలు, ఆవులు పెంచేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.. పాల విక్రయాల ద్వారా నెలసరి ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు..



పాడి సంపద అధరహో !

- చిక్కటి పాలు లీటరు రూ. 100.. మరో రకం రూ. 80.. లేక రూ.70
- స్వచ్ఛమైన పాల వైపే మొగ్గు
- భారమైనా పాడి పెంపకంపై ఆసక్తి చూపుతున్న రైతులు
- జిల్లాలో పాలిచ్చే పశువులు లక్షా 15 వేలు
- రోజుకు 5 లక్షల 70 వేల లీటర్ల ఉత్పత్తి



భీమవరం రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మంచి ఆరోగ్యానికి పాలు తాగాలని చెబుతున్నారు. దీంతో స్వచ్ఛమైన పాలకోసం పట్టణాలతో పాటు పల్లెల్లో పాలకు డిమాండ్ పెరుగుతోంది. పట్టణ వాసులకు ధర ఎక్కువైనా స్వచ్ఛమైన పాలు ఇంటికి వస్తున్నాయి. ఏ రోజు పాలు అప్పుడే అందుతున్నాయి. గతంలో పట్టణాలలో పాల ప్యాకెట్లపైనే ఆధారపడేవారు. అవి ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచుకుని వాడుకునేవారు. ఇప్పుడు రైతులే ఇంటింటికి వెళ్ళి పాలు పోస్తున్నారు. దీంతో రైతులకు ఆదాయం కూడా లభిస్తోంది. స్వచ్ఛమైన పాలు కావాలంటే కాస్త ధర ఎక్కువగానే ఉంటున్నాయి. చిక్కటి పాలు లీటరు కావాలంటే రూ. 100 దాకా తీసుకుంటున్నారు. ఆవు పాలు అయితే రూ. 80 ఆపై రూ.70 అమ్మకాలు చేస్తున్నారు.

రోజుకు 5 లక్షల 70 వేల లీటర్ల ఉత్పత్తి

గతంలో కంటే ఇప్పుడు పశువుల పెంపకం తగ్గినా జాతి పశువులు పెంచడం వల్ల పాల ఉత్పత్తి బాగానే ఉంది. దీంతో ఎక్కువ మంది పాడి పశువుల పాలు అందుతున్నాయి.

జిల్లాలో లక్షా 78, 137 గేదెలు, దూడలు ఉన్నాయి. 45,538 ఆవులు, దూడలు పెంచుతున్నారు. వీటిలో 90 వేల వరకు గేదెలు, 25 వేలు ఆవులు పాలు ఇస్తున్నాయి. మిగిలినవి చూడివిగా, దూడలుగా ఉన్నాయి. పాడి పశువుల నుంచి రోజుకు 5 లక్షల 70 వేల లీటర్లు పాలు ఉత్పత్తి అవుతుంది. జనాభాను బట్టి 9 లక్షలు పైగా పాలు వాడకం ఉంటుంది. అవసరాన్ని బట్టి పాల ప్యాకెట్లపైన లబ్ధిదారులు ఆధారపడాల్సి వస్తుంది. పశువుల పెంపకం పెరిగితే ప్యాకెట్ పాలు వాడకం తగ్గే అవకాశం ఉంటుంది.

రైతులకు నెలవారీ ఆదాయం

పల్లెల్లోని రైతులకు పాలు ఉత్పాదన నెలసరి ఆదాయంగా మారింది. కష్టమైనా పశువులను పెంచి పాలు నుంచి ఆదాయం పొందుతున్నారు.పాలు - మిగతా 8లో..

మద్ది ఆంజనేయస్వామికి తమలపాకుల పూజ



జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 10 : కార్తీకమాసం పురస్కరించుకుని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. స్వామి వారికి ప్రీతికరమైన తమలపాకులతో అష్టోత్తర పూజలు, అన్నప్రాసనలు, ప్రదక్షిణలతో మొక్కులు తీర్చుకుంటున్నారు. సోమవారం ఉదయం స్వామి వారికి లక్ష తమలపాకులతో పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవస్థానంకు వివిధ సేవల రూపంలో సోమ వారం ఒక్క రోజే రూ.1,82,050 ఆదాయం రాగా, దేవస్థాన నిత్యన్నదాన సత్రంలో 2900 మంది భక్తులకు అన్నప్రసాదాన్ని స్వీకరించినట్టు ఆలయ ఈవో చందన తెలిపారు.

మద్దిలో ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏఎస్పీ

గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామిని కార్తీక మాసం మూడవ మంగళవారం నాడు భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకునే అవకాశం ఉన్నందున సోమవారం రాత్రి జంగారెడ్డిగూడెం ఏఎస్పీ సుష్మిత రామనాథన్ ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కల్గకుండా పటిష్ట బందోబస్తు ఉండాలని ఆదేశించారు. ఈమె వెంట జంగారెడ్డిగూడెం సీఐ సుభాష్, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా వాయులింగేశ్వర స్వామి కల్యాణం

భీమవరం టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సోమవారం సందర్భంగా ఆనంద ఫంక్షన్ హాల్లో జ్ఞాన ప్రసునాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివార్ల కల్యాణం, కార్తీక దీపోత్సవాన్ని సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీకాళహస్తినుంచి వచ్చిన ప్రత్యేక రథం సోమేశ్వరస్వామి ఆలయం నుంచి శోభాయాత్రగా ఆనందా ఫంక్షన్ హాల్‌కు చేరుకున్నది. అక్కడ ప్రత్యేకంగా అలంకారం చేసిన వేదికపై స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచారు. ఉత్సవమూర్తుల వెంట వచ్చిన అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణ పక్రియ ప్రారంభించారు. స్వామివార్లకు అమ్మవారికి పట్టు వస్త్రాలను అందించి సాంప్రదాయ బద్ధంగా వేద మంత్రాలతో స్వామివార్ల ఉత్సవ మూర్తులకు కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణ పూజ కార్యక్రమాలలో పాల్గొని దీపోత్సవాన్ని ప్రారంభించారు. కార్తీక దీపాల వెలుగులో ఈ ప్రాంతం దేదీప్యమానంగా వెలిగిపోయింది. కార్యక్రమంలో ఉద్దరాజు కాశీవిశ్వనాథరాజు, కంతేటి వెంకటరాజు, మహిళ భక్తులు కూటమి నాయకులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న రాజ్యాంగ ప్రచార వేదిక సభ్యులు

రాజ్యాంగ విలువలకు విస్తృత ప్రచారం

ప్రచార వేదిక సభ్యుల పిలుపు

తణుకు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పీఠిక పఠనం-ప్రతిజ్ఞ పేరుతో పశ్చిమగోదావరి జిల్లాలో రాజ్యాంగ విలువలకు విస్తృత ప్రచారం ఒక ఉద్యమంగా సాగించాలని రాజ్యాంగ ప్రచార వేదిక పిలుపినిచ్చింది. సీపీఐ కార్యాలయంలో జిల్లా ప్రచార వేదిక కన్వీనర్ డీవీవీఎస్ వర్మ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ అన్ని విద్యాసంస్థలు, పౌరసమాజ సంస్థలు సకల పారిశ్రామిక సంఘాల భాగస్వామ్యంతో నిర్వహించాలని తలపెట్టిన కార్యక్రమానికి అన్ని సంస్థలు తమ సహకారం అందించాలని కోరారు. జిల్లా వేదిక సభ్యులు ఉద్దరాజు రామం ఫౌండేషన్ అధ్యక్షుడు మంతెన సీతారాం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు, జిల్లా సీఐటీయూ కార్యదర్శి పీవీ ప్రతాప్‌లు తమ సంఘాలు మద్దతు ప్రకటించాయి. సదస్సులో డాక్టర్ రమేష్ చంద్రబాబు, కొవ్వలి అంజేయ శర్మ, పేరూరి మురళీ కుమార్, విశ్రాంత ప్రిన్సిపాల్స్ సంకు మనోరమ, అద్దాల సత్యనారాయణలు మాట్లాడారు. ఈ సందర్భంగా రాజ్యాంగం సంక్షిప్త పరిచయం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

రాజ్యాంగ ప్రచార వేదిక జిల్లా కమిటీలో డీవీవీఎస్ వర్మ కన్వీనర్, డా.రమేష్ చంద్రబాబు, ఎస్.మనోరమ, పి.మురళీకుమార్, దక్షిణామూర్తి, జీవీ సుధాకర్, మంతెన సీతారాం, జోసెఫ్, మల్లుల శ్రీనివాస్, పి.గోవింద్. షర్మిల, అజయకుమార్, రాయవరపు రాజు సభ్యులుగా ఉన్నారు.

మహాదేవ శంభో

శివాలయాలకు పోటెత్తిన భక్తులు



అలంకరణలో భీమవరంలోని సోమేశ్వర స్వామి

పాలకొల్లు అర్బన్/భీమవరం టౌన్/ఆచంట/ ద్వారకాతిరుమల, పోలవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పాలకొల్లు క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో 8000 మంది భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. సుమారుగా 35 వేల మంది స్వామివారిని దర్శించుకున్నట్టు ఆలయ వర్గాల సమాచారం. ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఆర్‌పీ పట్నాయిక్, శ్రీధర శ్రీవల్లభ వెంకట విశ్వనాథ స్వామీజీ (న్యూఢిల్లీ) స్వామివారిని దర్శించు కున్నారు. భీమవరంలోని గునుపూడి సోమేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 11 గంటలు దాటిన తరువాత పంచారామ బస్సులు రావటంతో భక్తుల తాకిడి పెరిగింది మధ్యాహ్నం రెండు గంట లవరకు రద్దీకొనసాగింది. దాదాపు 20 వేల మంది భక్తులు దర్శించుకుని ఉంటారని అంచనా వేశారు. ఆచంటలోని ఆచంటేశ్వర స్వామి ఆయలంఓ కర్పూర జ్యోతిలో ఆవునెయ్యి వేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు రద్దీ ఎక్కువుగా ఉండటంతో క్యూలైన్ ద్వారా స్వామి వారిని దర్శించుకున్నారు. ద్వారకాతిరుమలలో క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతోన్న భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయాన్ని. పుష్ప మాలికలు, మామిడితోరణాలతో అలంకరించారు. మహిళా భక్తులు ఉసిరి చెట్ల వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. పట్టిసీమలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి క్షేత్రానికి భక్తుల తాకిడి ఎక్కువైంది. ఎస్ఐ పవన్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి భస్మార్చన, బిల్వార్చన, పంచామృ తాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు.



పాలకొల్లులో ప్రత్యేక అలంకరణలో క్షీరా రామలింగేశ్వర స్వామి







ద్వారకాతిరుమలలో ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు.. భీమవరం సోమేశ్వర స్వామి ఆలయంలో పోటెత్తిన భక్తులు.. పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న స్వామీజీ, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్



ఎడ్వర్డ్ ట్యాంకు

హుషారుగా బోటు షికారు

పార్కుల్లో ప్రజల ఆహ్లాదానికి చర్యలు

మరికొన్ని చోట్ల బోటు షికారుకు ప్రతిపాదనలు

భీమవరం టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భీమవరం పట్టణ ప్రజలతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు పట్టణంలోని పలు చోట్ల బోట్ షికారును అధికారులు అందుబాటులోకి తీసుకువస్తున్నారు. సాయంత్రం వేళ చెరువుల్లో బోటు షికారు ఉల్లాసాన్ని అందించబోతోంది. ఇందులో భాగంగా బీవీరాజు పార్కులో ఇప్పటికే బోటు షికారు అందుబాటులోకి రావటంతో ప్రజలు బోటు షికారు చేస్తున్నారు. త్వరలో ఎడ్వర్డ్ ట్యాంకులోను, సోమగుండంలోను బోటు షికారుకు ప్రతిపాదనలు ఉన్నాయి.

బివిరాజు పార్కులో ఏర్పాటు

ఇప్పటికే బీవీరాజు వీరమ్మ మునిసిపల్ పార్కులో బోటు షికారును ఇటీవల కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. బీవీరాజు విద్యాసంస్థలకు ఈ పార్కు నిర్వహణను మునిసిపాలిటీ అప్పగించింది. గునుపూడిలోని సోమగుండం చెరువులో కూడా స్పీడ్ బోటు ఏర్పాటుపై పరిశీలన చెయ్యాలని జిల్లాకలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులకు సూచించారు. అధికారులు ప్రతిపాదిస్తే త్వరలో పట్టణ ప్రజలకు స్పీడ్ బోటు అందుబాటులోకి వస్తుంది.



బీవీరాజు పార్కులో బోటు షికారు

- పట్టణ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా రోటరీ క్లబ్ ఎడ్వర్డు ట్యాంకును అభివృద్ధి చెయ్యటంతోపాటు బోటు షికారుకు శ్రీకారం చుట్టుంది. బ్యూటీఫికేషన్ ఆఫ్ భీమవరంలో భాగంగా గత జిల్లా కలెక్టర్ ప్రశాంతి సూచనల మేరకు రోటరీ క్లబ్ ఈ బాధ్యతను చేపట్టింది. ప్రస్తుత కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచనల మేరకు బోటు షికారుకు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే చెరువులో వాకింగ్ ట్రాక్ పూర్తి అయింది. చెరువు చుట్టూ ఫెన్సింగ్ పూర్తి చేశారు. దాదాపు రూ.60 లక్షలు వ్యయం చెయ్యనున్నారు. ఇందులో రూ.35 లక్షల వరకు ఎన్ఆర్ఐ జూపూడి సంజయ్ ఈ విరాళం అందించారు.



త్వరలో ప్రారంభిస్తాం

దాతల సహకారంతో రోటరీ క్లబ్ ఎడ్వర్డు ట్యాంకును సుందరంగా తీర్చిదిద్దాం. మరో రూ.10 లక్షల అభివృద్ధి పనులు ఉన్నాయి. రెండు బోట్‌లు సిద్ధంగా ఉన్నాయి. బోటు ఎక్కేందు వీలుగా ట్రాక్ ఏర్పాటు చేశాం.

జి.కిశోర్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు



చినవెంకన్న సేవలో

బాలనటుడు బుల్లిరాజు

ద్వారకాతిరుమల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బుల్లిరాజు పాత్రలో మంచి గుర్తింపు పొందిన బాలనటుడు రేవంత్ చినవెంకన్న ఆలయంలో సందడి చేశారు. సంక్రాంతికి వస్తున్నాం చిత్రం ద్వారా బుల్లిరాజుకు వచ్చిన గుర్తింపు అంతా ఇంతా కాదు. తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చిన బుల్లిరాజు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం పండితుల నుంచి వేదాశీర్వచనం, ప్రసాదాలను పొందారు. బుల్లిరాజును గుర్తించిన భక్తులు ఆతనితో ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపారు.

పిక్‌నిక్ స్పాట్‌లు వెలవెల

తుఫాన్, వర్షాల కారణంగా బురదమయంగా మారిన ప్రాంతాలు

తణుకు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):కార్తీక మాసంలో వన సమారాధనకు అవసరమైన తోటలు గత నెల చివరి రోజుల్లో సంభవించిన తుఫాన్, వర్షాల కారణంగా తణుకు ప్రాంతంలోని పలు పిక్‌నిక్ ప్రదేశాలు వెలవెల బోతున్నాయి. గతంలో కార్తీక మాసం సందర్భంలో కార్తీక వన సమారాధనలతో చిన్నారులు, యువత, మహిళల ఆట పాటలతో కిటకిటలాడుతూ ఎంతో ఉత్సాహభరిత వాతావరణంలో మెలిగిన ప్రదేశాలు నేడు తుఫాన్ కారణంగా కురిసిన వర్షపు నీటి కారణంగా కార్తీక వన సమారాధనలు నిర్వహించే వారి ఉత్సాహంపై నీరు చల్లినట్లైంది. గతంలో తణుకు మండలం లోని వేల్పూరు, మండపాక, దువ్వ, తదితర గ్రామాల్లోని కొబ్బరి, కోకో తోటలతో పాటు పట్టణ శివారులోని ఉండ్రాజవరం రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయం, ఇదే రోడ్డులో వున్న లే అవుట్ స్థలాలు, కొండాలమ్మ పుంత రోడ్డు లో ప్రతి ఏటా కార్తీక వన సమారాధనలు నిర్వహించే వారు. కార్తీక మాసంలో వచ్చే ఆదివారాలు, మంగళవారాలతో పాటు రెండవ శనివారాలు తోటలు, దేవాలయాల వద్ద మహిళలు, చిన్నారులు, విద్యార్థులతో కిటకి టలాడుతూ వుండేవి. ఈ సంవత్సరం కార్తీక మాసం ప్రారంభంలో కురిసిన భారీ వర్షాల కారణంగా పిక్‌నిక్ స్పాట్‌లు వుండే స్థలాల్లో నీరు నిలిచి పోవడం, బురదగా మారడంతో ఇప్పుడు కేవలం దేవాలయాల వద్దే కార్తీక వన సమారాధన కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు.



కార్తీక వన సమారాధన నిర్వహించే తణుకు ఉండ్రాజవరం రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణం వద్ద గడ్డితో నిండిన వైనం..

డ్రెయిన్ల ఆక్రమణ

పారుదల లేని నీరు.. ప్రవాహానికి అడ్డుపడుతున్న చెత్త



ఆక్రమణలతో కుంచించుకుపోయిన అందేవారి బోదె

ఆకివీడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని ప్రధాన డ్రెయిన్లు అభివృద్ధి చేయకపోవడంతో ప్రజానీకం రోగాలు బారిన పడుతున్నారు. అపారిశుధ్యం కారణంగా కుటుంబాలు విష జ్వరాలు, ఫీవర్లతో అల్లాడుతున్నారు. పట్టణం నడిబొడ్డున అందేవారిబోదె సుమారు 1500మీటర్లు, గంగానమ్మకోడ్ బోదె సుమారు 1200 మీటర్లు, మూలలంక బోదె సుమారు 2400 మీటర్లు పొడవు ఉన్నాయి. ఈ బోదెలు గతంలో పంట బోదెలను తలపించడమే కాకుండా రెండు పడవులు ప్రయాణించే విధంగా ఉండేవి. ఇప్పుడు అవి ఆక్రమణలకు గురై పూడుకుపోయాయి. కొన్నిచోట్ల మనిషి నడిచి వెళ్ళడానికి కూడా లేకుండా ఉన్నాయి. కొన్నిచోట్ల ఆక్రమణదారులు నిర్మాణాలు చేపట్టి అద్దెలకు కూడా ఇచ్చుకున్నారు. ఇవన్నీ ప్రజాప్రతినిధులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. ప్రక్షాళన చేయడంలేదు. నగర పంచాయతీ ఏర్పడిన తరువాత ఆక్రమణలు తొలగించాల్సి ఉండగా ఇంకా పెరుగుతున్నాయంటూ ప్రజలు వాపోతున్నారు. ఈ డ్రెయిన్లకు సంబంధించి సుమారు మైనరు 360, మీడియం 10 డ్రెయిన్లు కూడా ఈ మూడు డ్రెయిన్‌లలో కలుస్తాయి. ఇదిలావుండగా డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు మూలలంక బోదెకు సంబంధించిన ఆక్రమణలు అక్కడక్కడ తొలగించారు. డ్రెయిన్‌ను జేసీబీతో వెడల్పు చేశారు. అయితే మరలా ఆ డ్రెయిన్ పూడుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ఆక్రమణలు తొలగించిన ప్రదేశంలో వాహనాలు పెట్టడం, చెత్తలు వేయడం జరుగుతున్నా పాలకులు,అధికారులు గాని పట్టించుకోవడంలేదు. కొన్ని డ్రెయిన్లలో చెత్త పేరుకుపోయింది. డ్రెయిన్ల ఆక్రమణలు తొలగించి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ప్లాస్టిక్ కవర్లు, చెత్తతో నిండిన మూలలంక డ్రెయిన్

నేడు ఏలూరులో యువజనోత్సవ పోటీలు

ఏలూరు అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతిని (జనవరి 12) పురస్కరించుకుని నిర్వహించే జాతీయ యువజనోత్సవం సన్నాహాల్లో భాగంగా ఈ నెల 11న ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ఆడిటోరియంలో ఏలూరు జిల్లాస్థాయి యువజనోత్సవాలే జరుపుతున్నట్టు సెట్‌వెల్ సీఈవో కె.ఎస్.ప్రభాకరరావు తెలిపారు. భరత నాట్యం, కూచిపూడి, ఫోక్‌డ్యాన్స్(సోలో), వెస్ట్రన్ డ్యాన్స్(గ్రూప్), ఏదైనా సంగీత వాయిద్యం(వ్యక్తిగతం)అంశాల్లో జిల్లాస్థాయి పోటీలు, ఇన్నోవేషన్ ట్రాక్ ప్రధానాంశంగా సైన్స్ ఎగ్జిబిషన్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. జాతీయ స్థాయి వరకు నిర్వహించే పోటీలు కల్చరల్ ట్రాక్‌లో జానపదనృత్యం(గ్రూప్), జానపద గీతం(గ్రూప్), కవిత్వం, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, ఉపన్యాసం అంశాల్లో జరుగుతాయన్నారు. జిల్లాకు చెందిన 15 నుంచి 29 సంవత్సరాల వయస్సుగల యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు. కల్చరల్ పోటీల్లో ప్రథమ, ఇన్నోవేషన్ ట్రాక్ పోటీలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విజేతలను రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు ఏలూరుజిల్లా నుంచి ప్రాతి నిధ్యం వహించడానికి పంపిస్తామన్నారు.

సెలవుల్లో తరగతులు

నాలుగు ప్రైవేట్ పాఠశాలలకు షోకాజ్ నోటీసులు

ఏలూరు అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సెలవుదినాలు, ఇతర పనిదినాల్లో రాత్రి ఏడు గంటల వరకు తరగతులు నిర్వహిస్తుండటంపై నగరంలోని నాలుగు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు జిల్లా విద్యాశాఖ షోకాజ్ నోటీసులు జారీచేసింది. విపత్తు సెలవుల భర్తీలో భాగంగా ఈ నెలలో రెండో శనివారం అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు పని దినంగా విద్యాశాఖ ప్రకటించిన విషయం విదితమే. కాగా ఆదివారం సైతం ఈ నాలుగు ప్రైవేటు పాఠశాలలను తెరిచి తరగతులు నిర్వహిస్తుండటంపై విద్యార్థి సంఘాలు డీఈవో వెంకటలక్ష్మమ్మకు ఫిర్యాదు చేశాయి. ఆ వెంటనే క్షేత్రస్థాయిలో నిర్ధారించుకుని షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం సంబంధిత పాఠశాలల ప్రతినిధులు డీఈవో కార్యాలయానికి విచ్చేసి నోటీసులకు సంజాయిషీ ఇచ్చారు. విద్యార్థుల తల్లితండ్రుల అభీష్టంమేరకే తరగతులు నిర్వహిస్తున్నామని ప్రైవేటు పాఠశాలల ప్రతినిధులు వివరణివ్వగా, ఆ మేరకు పేరెంట్స్ నుంచి తీసుకున్న అంగీకార పత్రాలను చూపించమని విద్యాశాఖ అధికారులు అడగ్గా, వాటిని చూపించలేకపోయారు. దీంతో తొలి తప్పుగా పరిగణించి వదిలేయాలని పాఠశాలల ప్రతినిధులు అభ్యర్థించారు. దీనిపై విద్యాశాఖ నుంచి ఎటువంటి స్పందన రాలేదు.

డెమో రైళ్లు పొడిగించాలని కేంద్ర మంత్రి ప్రతిపాదన

నిడదవోలు కాదు రాజమండ్రి వరకు.. రైల్వే అధికారుల సానుకూల స్పందన



నరసాపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా నుంచి రాజమండ్రి వెళ్లే ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి. ప్రస్తుతం రాజమండ్రికి రాత్రి పూట మాత్రమే ఒక రైలు నడుస్తోంది. నరసాపురం, భీమవరం నుంచి నడుస్తున్న డెమో అన్ని నిడదవోలు వరకే వెళుతున్నాయి. వీటిని రాజమండ్రి వరకు పొడిగించాలని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ ప్రతిపాదించారు. ఇటీవల దక్షిణ మధ్య రైల్వే అధికారులకు ఈ రైలు పొడిగింపు ఆవశ్యకతను వివరించారు. జిల్లా నుంచి నిత్యం వేల మంది రాజమండ్రి వెళుతుంటారు. ప్రస్తుతం సరైన రైళ్ల సదుపాయం లేకపోవడం వల్ల వీరంతా బస్సుల్ని ఆశ్రయించాల్సి వస్తున్నది. ఎక్కువ చార్జీతో పాటు సమయం కూడా వృథా అవుతున్నది. వీటిని పరిగణలోకి తీసుకుని ప్రస్తుతం జిల్లా నుంచి నడుస్తున్న డెమోలను రాజమండ్రి వరకు నడపాలని మంత్రి కోరారు. దీనికి రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ప్రతి రోజు నరసాపురం నుంచి మూడు, భీమవరం నుంచి నాలుగు రైళ్లు రాజమండ్రి వెళుతున్నాయి. వీటిలో రాత్రి పూట నరసాపురం నుంచి 8గంటలకు బయలు దేరే రైలు మినహా మిగినవి నిడదవోలు వరకే వెళుతున్నాయి. వీటిలో కనీసం నాలుగు రైళ్లనా పొడిగిస్తే రాజమండ్రి ప్రయాణం సులభతరం అవుతుంది. దీని వల్ల రాజమండ్రి జంక్షన్ నుంచి విశాఖ వెళ్లేందుకు కూడా వీలుంటుంది. ప్రస్తుతం నరసాపురం నుంచి బస్సులో వెళ్లాలంటే సిద్ధాంతం, రావులపాలెం మీదుగా వెళ్లాల్సి వస్తుంది. ఇటు భీమవరం నుంచి అయితే వీరవాసరం, మార్టేరు, సిద్ధాంతంగా మీదుగా వెళ్లాల్సి ఉంది. రెగ్యులర్‌గా బస్సులు కూడా లేకపోవడంతో మారుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అదే డెమో రైళ్లను పొడిగిస్తే రెండున్న గంటల్లో వెళ్లిపోవచ్చు. ఛార్జీ కూడా తక్కువ.

కవితాక్షరం అందెశ్రీ

సుప్రసిద్ధ ప్రజాకవి, తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ భౌతికంగా ఇకలేరన్న వార్త సాహితీ లోకాన్ని కలచివేసింది. ఆయన కవిత్వంలో ఎక్కడా కృత్రిమత్వం కనిపించేదికాదు. అదో క చెట్టున మగ్గిన పండు. ఆయన పెద్దగా చదువుకోలేదు కాని కవిత్వం ఆయనను చదువుకుంది. అందెశ్రీ అక్షరాలలో ఒక నిజాయితీ కనిపించేది. పోరాటపటిమ ఉండేది. తలెత్తి నిలబడే తత్వం ఆయనది. ఈమధ్య తను రాసిన పుస్తకావిష్కరణకు తణుకు వస్తానన్నారు. తగిన స్థాయిలో సగౌరవంగా త్వరలో ఆహ్వానించగలమని, వారికి విన్నవించాను. తణుకు పట్టణం ఆయన పాదాలను ముద్దాడకుండానే అందె ఇవ్వడలు వినకుండగనే అందెశ్రీ కన్నుమూయటం బాధాకరం. ఆ కవితాక్షరానికి నివాళులు.

- రసరాజు

జాతీయ స్విమ్మింగ్‌లో పశ్చిమ పోలీసులకు పతకాలు


పతకాలు సాధించిన పోలీసులను అభినందిస్తున్న ఎస్పీ

భీమవరం క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా పోలీసు శాఖకు చెందిన సిబ్బంది జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పతకాలతో మెరిసి జిల్లాకు, పోలీసు శాఖకు గర్వకారణంగా నిలిచారని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. మాస్టర్ ఆక్వాటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గుంటూరులో అక్టోబర్ 11, 12 తేదీల్లో జరిగిన ఏడవ నేషనల్స్ మాస్టర్స్ ఆక్వాటిక్ ఛాంపియన్ షిప్‌లో తాడేపల్లిగూడెం టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ టి.సత్యనారాయణ 50 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో వెండి పతకం సాధించారు. కానిస్టేబుల్ అనిల్ కుమార్ 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 50 మీటర్ల ఫ్రీ స్టయిల్, 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ విభాగాల్లో మూడు కాంస్య పతకాలు గెలుచుకున్నారు. వారిద్దరిని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అభినందించారు.

అంతర్‌జిల్లా బాస్కెట్ బాల్ విజేత ఉమ్మడి పశ్చిమ



విజేతగా నిలిచిన ఉమ్మడి పశ్చిమ జట్టు

ఏలూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జరిగిన 11వ అంతర్‌జిల్లా బాస్కెట్ బాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మహిళా జట్టు విజేతగా నిలిచింది. ఈనెల 7వ తేదీ నుంచి 10 వరకు విశాఖపట్నంలోని పీటీవీఎస్ రావు, బీవీకే హైస్కూల్ ప్రాంగణంలో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మహిళా జట్టు, శ్రీకాకుళం అనంతపూర్, తూర్పుగోదావరి, జిల్లాల జట్లుపై గెలుపొంది ఫైనల్ చేరింది. ఫైనల్ విశాఖపట్నం జిల్లాతో తలపడింది. హోరాహోరీగా సాగిన ఈపోటీలో 54-52 పాయింట్లతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మహిళల జట్టు విజయకేతనం ఎగురవేసింది. జట్టు సభ్యులను జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.కృష్ణారెడ్డి, గవ్వ శ్రీనివాసరావు, కోశాధికారి కె.మురళీకృష్ణ అభినందించారు. కాగా బాలుర విభాగంలో నాలుగో స్థానం దక్కించుకున్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు బొర్రంపాలెం విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

టి.నర్సాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్.సంధ్యా, సీహెచ్.చైతన్య, బి.ప్రేమ్ కుమార్‌లు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు అమ్మద్‌ఆలీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీన గోపన్నపాలెంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులు ఈ నెల 22వ తేదీన అనకాపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. విద్యార్థులను


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు, సిబ్బంది

వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు అభినందించారు.

స్కిల్ కాంపిటీషన్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


పెదపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్కిల్ కాంపిటీషన్స్ క్రీడా పోటీల్లో పెదపాడు హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్.ఎం. పి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈనెల 7వ తేదీన విద్యాశాఖ, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరులో స్కిల్ కాంపిటీషన్స్ పది విభాగాల్లో నిర్వహించగా, పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు నాలుగు ప్రాజెక్టులు తయారుచేసి పోటీలో పాల్గొన్నారన్నారు. వీటిలో కె.అక్షయ, వి.చంద్రశ్రీ, ఎన్.రుద్రసాయితేజ, ఆర్.కావ్యశ్రీలు తయారు చేసిన రెండు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లుగా తెలిపారు. అలాగే స్కూల్స్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 14 ఏళ్ల లోపు విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు రాపాక శ్యాంసుందర్ ఎంపికయ్యాడు. వీరిని పాఠశాలలో సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్రస్థాయి జూడోలో జగదీశ్‌కు రజత పతకం


జగదీశ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో శనివారపుపేట జిల్లా పరిషత్ విద్యార్థి ప్రతిభ కనబరిచి రజిత పతకం సాధిం చాడు. ఇటీవల కాకినాడలోని డీఎస్ఏ మైదానంలో అంతర్ జిల్లాల స్కూల్ గేమ్ ఫెడరేషన్ జూడో ఛాంపియన్‌షిప్ అండర్-17 పోటీలు హోరాహోరీగా సాగాయి. 47 కేజీల విభాగంలో 9వ తరగతి విద్యార్థి బి.జగదీశ్ ప్రతిభ కనబరిచి రజిత పతకం సాధించాడు. జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపిక అయ్యాడు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్‌ఎం ప్రకాష్, పీడి పద్మలత, ఉపాధ్యాయులు అభినందించారు.

కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా పాలూరి



నరసాపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ కౌన్సిల ర్ పాలూరి బాబ్జీకి కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పదవి దక్కింది. ఈమేరకు ప్రభుత్వం నుంచి సోమవారం ఉత్తర్వులు అందాయి. ప్రస్తుతం బాబ్జీ 31వ వార్డు కౌన్సిలర్‌గా పని చేస్తున్నారు. ఇటీవల తరుచూ మంత్రి నారా లోకేశ్‌ను భూ సమస్యలపై కలుస్తూ వస్తున్నారు. ఆయనకు ఈ పదవి లభించడం పట్ల విప్ నాయకర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి తదితరులు అభినందనలు తెలిపారు.

జడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా

ఏలూరుసిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):ఈనెల 11వతేదీ జరగవలసిన జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు, జడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్టు జిల్లా పరిషత్ సీఈవో ఎం.శ్రీహరి సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఉన్నందున, సదరు కార్యక్రమంలో అందరు అధికారులు పాల్గొనవలసి ఉన్నందున ఈ సమావేశాలు వాయిదా వేసినట్టు ఆయన వివరించారు. తదుపరి సమావేశం నిర్వహించే తేదీ తిరిగి తెలియజేయటం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఉచితంగా నీట్‌కు ప్రత్యేక శిక్షణ

పెదపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డాక్టరు బి.ఆర్. అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకుని నీట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉచిత శిక్షణను ఇవ్వనున్నట్లుగా గురుకులాల జిల్లా సమన్వయాధికారిణి బి.ఉమకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ లోని డాక్టరు బి.ఆర్.అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం దగ్గరలోని డాక్టరు బి.ఆర్.అంబేద్కర్ గురుకుల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని కోరారు.

క్రీడలకు లేదు వయసు


పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

- ఆరుపదుల వయస్సు దాటినా తగ్గని ఉత్సాహం
- ముగిసిన క్వాలిఫై పోటీలు
- ప్రారంభమైన మెయిన్ డ్రా పోటీలు
- ప్రారంభించిన నరసాపురం ఆర్డీవో

క్రీడలకు వయస్సు అడ్డుకాదని, ఆరు పదులు దాటినా ఉత్సాహం ఉరకలు వేస్తూనే ఉంటుందని పలువురు టెన్నిస్ క్రీడాకారులు నిరూపిస్తున్నారు. 60 ఏళ్ళు దాటిన క్రీడాకారులకు వయసుతో పని లేదని క్రీడాకారుల మధ్య పోటీ అని తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులను చూస్తే తెలుస్తోంది. పాలకొల్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్సులో జరుగుతున్న జాతీయ స్థాయి టెన్నిస్ టోర్నమెంట్‌లో పాల్గొన్న పలువురు క్రీడాకారుల అభిప్రాయాలు పంచుకున్నారు.

పాలకొల్లు టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): క్రీడల వల్ల మానసిక వికాసంతో పాటు శారీరక దారుఢ్యం పెరుగుతుందని, ఏ వయస్సు వారైనా క్రీడల్లో పాల్గొని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు అన్నారు. స్థానిక కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్‌లో నిర్వహిస్తున్న టెన్నిస్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సంస్థ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని, అలాగే పేదవారికి ఆరోగ్య సేవలు, విద్యార్థులకు విద్యా సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఏఎస్‌పి కోటేశ్వరరావు విశ్రాంత న్యాయమూర్తి వైవీ రామకృష్ణ, కాస్మో క్లబ్ కార్యదర్శి వీవీ సోమరాజు. సిహెచ్ వెంకటేశ్వర వర్మ, డాక్టర్ కేఎస్‌పీఎస్ వర్మ, ఏ రాంబాబు, టెన్నిస్ పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి బూన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు : సింగిల్స్‌లో 55 ఏళ్ళ విభాగంలో విశ్వనాథ్ రాము, పి. కృష్ణపై మీద విజయం సాధించారు. 45 ఏళ్ళ విభాగంలో ఎంవీఎల్ఎన్ రాజు ఎం. జగదీష్‌పై, 65 ఏళ్ళ విభాగంలో వి శ్రీనివాస రెడ్డి ఎల్ రంజిత్‌పై విజయం సాధించారు. 70 ఏళ్ళ పైబడిన విభాగంలో సత్యనారాయణ సింగ్ రాధాకృష్ణమూర్తిపై విజయం సాధించారు. ఎస్‌సి అశోక్ రెడ్డి, కేటీ విజయ్‌కుమార్‌పై విజయం సాధించారు. ఫైనల్స్ ఈ నెల 14వ తేదీవరకూ కాస్మో కల్చరల్ స్పోర్ట్సు కాంప్లెక్స్‌లో నిర్వహించనున్నారు. పోటీల అనంతరం 14వ తేదీ సాయంత్రం బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు.


సోమవారం టెన్నిస్ పోటీలను ప్రారంభిస్తున్న నరసాపురం ఆర్డీవో దాసి రాజు

150 టోర్నమెంటుల్లో పాల్గొన్నా..
-ఎం. సాయి రాంబాబు, హైదరాబాదు



నా వయస్సు 83 ఏళ్లు. 33 ఏళ్లుగా టెన్నిస్ ఆడుతున్నా. ఆరోగ్య సమస్యల్లేవు. ఇప్పటి వరకూ 150 టోర్నమెంట్లలో పాల్గొన్నా. సింగిల్స్‌లో 35 కప్పులు సాధించా. 75 ఏళ్ల దాటిన విభాగంలో ప్రస్తుతం ఆడుతున్నా. టెన్నిస్ ప్లేయర్లకు ఇక్కడ సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయి. యువత సద్వినియోగం చేసుకోవాలి.

40 కప్పులు గెలుచుకున్నా..
-వి. ధనుంజయులు, శ్రీకాళహస్తి



టెన్నిస్ అంటే ప్రాణం. సుమారు 40 ఏళ్ళుగా ఆడుతున్నా. దేశంలో ఎక్కడ పోటీలు జరిగినా పాల్గొంటా. సింగిల్స్ విభాగంలో 10 కప్పులు సాధించా. డబుల్స్ విభాగంలో 30 కప్పులు గెలుచుకున్నాను. 2014లో మద్రాసులో ఉత్తమ ప్లేయర్ అవార్డు అందుకున్నా. ప్రస్తుతం 65 ఏళ్ల దాటిన విభాగంలో ఆడుతున్నా. ఇక్కడ ఏర్పాట్లు చాలా బాగున్నాయి.

టెన్నిస్ కోర్టుల నిర్వహణ బాగుంది
-అంజన్ భట్టాచార్య, కలకత్తా



గత 12 ఏళ్లుగా టెన్నిస్ ఆడుతున్నా. 70 ఏళ్ల దాటిన విభాగంలో తలపడుతున్నా. టెన్నిస్ అంటే ఇష్టంతో దేశంలో ఏ ప్రాంతంలో పోటీలు జరిగినా పాల్గొంటా. చిన్నా, పెద్ద పట్టణాలు, నగరాలు అనే తేడా ఉండదు. ఇక్కడ పాలకొల్లు, నరసాపురంలో టెన్నిస్ కోర్టుల నిర్వహణ చాలా బాగుంది. ఈ ప్రాంతం నుంచి యువకులు టెన్నిస్‌లో శిక్షణ పొంది దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకోవాలి.

టెన్నిస్‌తో ఉల్లాసంగా ఉంటున్నా..
-ఎం. పురుషోత్తం, తిరుపతి



శని, ఆదివారాల్లో జరిగిన క్వాలిఫై మ్యాచ్‌ల్లో మెయిన్ డ్రాకు క్వాలిఫై అయ్యాను. టీటీడీలో ఇంజనీర్‌గా పనిచేసి రిటైర య్యా. టెన్నిస్ ఆడటంతో ఉల్లాసంగా ఉంటున్నా. ఇక్కడ సౌకర్యాలు బాగున్నాయి. టెన్నిస్ నేర్చుకోవాలనుకునే వారికి శిక్షణ ఇస్తా. ఇక్కడ కోర్టులు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉన్నాయి. యువత వినియోగించుకోవాలి.

యువతకు ఉపాధి దిశగా అడుగులు..

- మర్సపూడిలో రమణ్‌సింగ్ ఫుడ్ పార్క్
- సీహెచ్. పోతేపల్లిలో పామాయిల్ డౌన్‌స్ట్రీమ్ ప్రాజెక్టు
- పట్టాయగూడెంలో ఎంఎస్‌ఎంఈ పార్కు..
- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం

(నూజివీడు - ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం యువతకు ఉద్యోగ ఉపాధి కల్పన దిశగా శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ క్రమంలో నూజివీడు మండలం మొర్సపూడి గ్రామ పరిధిలో రమణ్‌సింగ్ మెగా ఫుడ్‌పార్క్ ఏర్పాటుకు సీఎం నేడు వర్చువల్‌లో శంకుస్థాపన చేయనున్నారు. మూడు ఫేసుల్లో దాదాపు రూ. 102 కోట్లు వ్యయంతో ప్రారంభిస్తున్న ఈ మెగా ఫుడ్‌పార్క్ తొలుత జీరో యాడెడ్ షుగర్‌తో పల్ప్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. ఎనిమిది వేల మెట్రిక్ టన్నుల వేర్ హౌస్ కోల్డ్ స్టోరేజీలలో ఏర్పాటు కానున్న ఈ ప్రైవేటు సెక్టార్ పరిశ్రమ గోగినేని విజయ్ బాలాజీ, పద్మావతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తుండగా నూజివీడు ప్రాంతంలో దాదాపు 1500 మంది వరకు ఉపాధి లభించే అవకాశం ఉంది.

లోకేశ్ చొరవతో..

ఈ కర్మాగారం నిర్మించనున్న గోగినేని విజయ్ బాలాజీ గొల్లపల్లివాసి గోగినేని ప్రసాద్ (బాబు) కుమారుడు. ఇతను అమెరికాలో లోకేశ్ చదివిన వర్సిటీలో ఆయనకు సహ విద్యార్థి. ఆయన అమెరికాలోనే స్థిరపడ్డారు. ఇటీవల లోకేశ్ అమెరికాలో పర్యటిం చినప్పుడు బాలాజీతో మీ సొంతూరిలో అక్కడి రా మెటీరియల్‌తో ఏదైనా పరిశ్రమ స్థాపించాలని కోరడం తో ఆయన ఈ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు అంగీకరించినట్లు సమాచారం.

పామాయిల్ డౌన్ స్ట్రీమ్ ప్రాజెక్టు..

ఏలూరు: జిల్లాలోని ద్వారకాతిరుమల మండలం సీహెచ్. పోతేపల్లిలో 30 ఎకరాల స్థలంలో గోద్రెజ్ ఆగ్రోవెట్ పామాయిల్ డౌన్ స్ట్రీమ్ ప్రాజెక్టుకు సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. రూ. 208 కోట్లతో ఈ ప్రాజెక్టు రూప కల్పన చేయగా 300 మందిపైగా ఉపాధి కల్పించనున్నారు.

పట్టాయగూడెంలో ఎంఎస్‌ఎంఈ పార్కు...

చింతలపూడిలోని పట్టాయగూడెంలో 65 ఎకరాల్లో స్థాపించనున్న ఎంఎస్‌ఎంఈ పార్కులో భాగంగా 20 ఎకరాల విస్తీర్ణంలో 14.5 కోట్లతో మౌలిక వసతుల కల్పించారు. దీన్ని సీఎం వర్చువల్ ప్రారంభిస్తారు.

నేడు మంత్రి నాదెండ్ల రాక

జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రానున్నారు. విజయవాడ నుంచి బయల్దేరి ద్వారకాతిరుమలకు చేరుకుని సీహెచ్. పోతేపల్లిలో గోద్రెజ్ ఆగ్రోవెట్ పరిశ్రమ ప్రారంభోత్సవంలో పాల్గొని, అనంతరం చింతలపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.30 గంటలకు అక్కడే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభిస్తారు.




వర్చువల్‌లో నేడు సీఈఎం ప్రారంభించనున్న ఫుడ్‌పార్క్ (ఇన్‌సెట్) మర్సపూడిలో మెగా ఫుడ్ పార్క్ వ్యవస్థాపకులు గోగినేని విజయ్ బాలాజీ

డ్రోన్ ద్వారా పేకాట శిబిరం గుర్తింపు అరెస్టు


డ్రోన్‌తో పర్యవేక్షిస్తున్న పోలీసులు

నిడమర్రు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికతో అ సాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్టవేస్తున్నామని నిడమర్రు సి.ఐ. రజనీ కుమార్ పేర్కొన్నారు. నిడమర్రు మండలం ఛానమిల్లి గ్రామంలో గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.64 వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని కోర్టులో సోమవారం హాజరుపరిచామన్నారు. నిడమర్రు ఎస్ఐ రమేశ్ మాట్లాడుతూ మండలంలో మారుమూల ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు, పేకాట, కోడి పందేలు వంటివి నిర్వహిస్తే డ్రోన్‌తో పర్యవేక్షిస్తూ నిఘా పెంచుతామన్నారు. ఈ విధంగా డ్రోన్ ద్వారానే పేకాట శిబిరం పట్టుకున్నామన్నారు.

కోడి పందాలు నిర్వహిస్తున్న 24 మంది అరెస్ట్

పెదపాడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అప్పనవీడులో కోడి పందాలు ఆడుతున్నారనే సమాచారం మేరకు స్టేషన్ సిబ్బందితో కలిసి దాడి చేసి 24 మంది పందెం నిర్వాహకులను అరెస్ట్ చేసినట్టు ఎస్.ఐ కట్టా శారదా సతీశ్ తెలిపారు. వీరి నుంచి రూ.76,100 నగదుతో పాటుగా రెండు పందెం కోళ్లు, 45 కోడి కత్తులు, 30 సెల్ ఫోన్లు, 14 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని కోర్టులో హాజరుపర్చి పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

పెదపాడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కలపర్రు టోల్‌గేట్ వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి యాత్రికులతో కూడిన టెంపో ఢీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలైనట్టు పెదపాడు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు. కాకినాడ జిల్లాకు చెందిన యాత్రికులు యానాం నుంచి అమరావతికి పంచారామాల దర్శనం కోసం వెళ్తుండగా మార్గ మధ్యలో టోల్‌గేట్ వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్‌ను టెంపో ఢీకొంది. ఈ ఘటనలో టెంపోలోని నలుగురు మహిళలతో పాటుగా ఒకరు గాయపడ్డారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు ప్రాంతానికి చెందిన కె. నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఏలూరు క్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నడిరోడ్డుపై పడుకుని ఉన్న ఆవును మోటారు సైకిలిస్టు బలంగా ఢీకొని తీవ్ర గాయాలతో మృతి చెందాడు. కండ్రికగూడెం ప్రాంతానికి చెందిన పిల్లేటి ధనుంజయరావు(44)కు భార్య అనిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 9వ తేదీ రాత్రి తన ఇంటి నుంచి బయటకు మోటారు సైకిల్‌పై పని మీద వెళ్తున్నాడు. మార్గమధ్యలో దాదాఫలవ్ సెంటర్ వద్ద రోడ్డుపై ఒక ఆవు పడుకుని ఉంది. అతి వేగంగా వెళ్లి ఆవును ఢీకొట్టాడు. గాయపడిన ధనుంజయ రావును ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


భీమవరం రైల్వే స్టేషన్‌లో తనిఖీల దృశ్యం


నరసాపురంలో ఆర్టీసీ బస్సులో తనిఖీలు


జంగారెడ్డిగూడెంలో లాడ్జిని పరిశీలిస్తున్న పోలీసులు

అంతటా హైఅలర్ట్..

ఢిల్లీ పేలుళ్ల నేపథ్యంలో ముందస్తు భద్రతా తనిఖీలు - జన సామర్థ్యం ఉన్న ప్రాంతాలపై దృష్టి


ఏలూరు క్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఎర్రకోట వద్ద సోమవారం రాత్రి పేలుళ్ల సంభవించాయి. మెట్రో స్టేషన్ సమీపంలోని గేటువన్ వద్ద పార్కింగ్ చేసిన ఒక కారు నుంచి పేలుళ్ళు సంభవించి పక్కనే ఉన్న అనేక కార్లు, వాహనాలకు పేలుళ్ల సంభవించాయి.ఈ ప్రమాదంలో ఎంత మంది మరణించారు.. ఎంత మంది గాయపడ్డారనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. దేశం మొత్తంగా అప్రమత్త చర్యలను చేపట్టారు. దీనిలో భాగంగా జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని అత్యంత రద్దీ ఉండే ప్రదేశాల్లో పార్కింగ్‌లో ఉన్న వాహనాలను, లగేజీలను బాంబుస్క్వాడ్, పోలీసు జాగిలాలతో విస్తృతంగా సోమవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్, పవర్‌పేట రైల్వే స్టేషన్, కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, నూజివీడు, కైకలూరు రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, జంగారెడ్డిగూడెం, ద్వారకాతిరుమల బస్టాండ్లు, వివిధ దేవాలయాల ప్రాంతాల వద్ద పార్కింగ్‌లో ఉన్న వాహనాలను మెటల్ డిటెక్టర్లు, పోలీసు జాగిలాలతో,బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌లు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. సినిమా హాళ్ల, వివిధ ప్రాంతాల్లో ఉన్న పార్కింగ్ వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. ఈ తనిఖీలు మంగళవారం కూడా కొనసాగించనున్నారు. అంతేకాకుండా రహదారులపై వాహన తనిఖీలు కూడా నిర్వహిస్తు అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నిస్తున్నారు. ఢిల్లీ పేలుళ్లతో జిల్లా పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. ఈ ఘటనల దృష్ట్యా జిల్లాలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. గతంలో అనేక ఉగ్ర మూలాలు బయట పడిన నేపథ్యంలో ఏలూరు జిల్లా పోలీస్ శాఖ ముందస్తుగా అప్రమత్తమై ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాలతో పోలీసులు సోమవారం రాత్రి నుంచే విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

పశ్చిమ గోదావరి జిల్లాలో..

భీమవరం క్రైం: పశ్చిమ గోదావరి జిల్లాలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాలతో పోలీసులు అలర్ట్ అయ్యారు. సోమవారం రాత్రి లాడ్జిలు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు, పార్కింగ్ ప్రదేశాలను, అలాగే వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. అనుమానం ఉన్న వ్యక్తులను ఆరా తీస్తున్నారు. అనుమానం కలిగిన వస్తువులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. వీఐపీల ఇళ్ల వద్ద భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య మాట్లాడుతూ జిల్లా అంతటా ఎస్పీ ఆదేశాలతో డీఎస్పీల ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేశామని తెలిపారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లాడ్జీలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జనసామర్థ్యం కల్గిన ప్రదేశాలు, పార్కింగ్‌ల్లో వాహనాలను బాంబు స్క్వాడ్‌లు, పోలీసు జాగిలాలతో తనిఖీలు చేపట్టారు. ఢిల్లీ పేలుళ్లపై పూర్తి సమాచారం ఇంకా చేరలేదని అయినప్పటికీ ముందస్తు జాగ్రత్తల నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నామని పోలీసులు తెలిపారు.

నరసాపురంలో: ఢిల్లీ పేలుళ్లతో నరసాపురంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. సోమవారం రాత్రి డీఎస్పీ డాక్టర్ శ్రీవేద ఆధ్వర్యంలో బస్టాండ్, రైల్వే స్టేషన్ విస్తృత తనిఖీలు చేస్తారు. అంబేద్కర్ సెంటర్‌లో వాహనాలు నిలుపుదల చేసి క్షుణంగా సోదాలు చేసి పంపారు. రాత్రి పొద్దుపోయే వరకు తనిఖీలు జరుగుతునే ఉన్నాయి. అంబేద్కర్ సెంటర్ నుంచి కృష్ణా జిల్లా వైపు వెళ్లే ప్రతి వాహనాన్ని నిలుపుదల చేశారు. క్షుణంగా తనిఖీ చేసిన తరువాతే పంపారు. సీఐ దుర్గ ప్రసాద్, ఎస్.ఐలు జయలక్ష్మిలు పాల్గొన్నారు.

వాగులోకి జారిపడి ఒకరి మృతి




ఆగిరిపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటపల్లి గ్రామ సమీపంలో గల కుంపిని వాగులోకి జారిపడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఆగిరిపల్లి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఎస్ఐ శుభశేఖర్ తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని చిన ఆగిరిపల్లి గ్రామానికి చెందిన వర్ధకవి రాజేష్ రాజు (60) పూజకు వాడిన పువ్వులను నీళ్లల్లో వదిలేందుకు ఆదివారం సాయంత్రం గ్రామానికి సమీపంలోని కుంపినీ వాగు వద్దకు వెళ్లి పూలను వాగులో వేసేందుకు దిగగా ప్రమాదవశాత్తు వాగులో జారిపడి కొట్టుకుపోయాడు. రహదారిపై వెళ్ళే వారు గమనించి, పట్టుకునే యత్నం చేసినప్పటికీ జాడ దొరకలేదు. సోమవారం మధ్యాహ్నం జాలర్లకు రాజు మృతదేహం లభ్యమయ్యింది. శవ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగం చేస్తున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిపారు.

ఎరకు చిక్కిన ఎలుకలు.. కొనసాగుతున్న విచారణ

ఏలూరు క్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఉన్న మెడికల్ కళాశాల బాలికల వసతి గృహంలో విద్యార్థినులపై ఎలుక దాడి చేసిన సంఘటనపై అధికారులు సత్వర చర్యలు చేపట్టారు. ఈ నెల 7న ఆరుగురు విద్యార్థినులను ఎలుక కరవగా 8వ తేదీన ఒక విద్యార్థిని మరో ఎలుక కరిసింది. మొత్తం ఏడుగురు విద్యార్థినులు ఎలుకల దాడికి గురయ్యారు. హాస్టల్‌లో ఎలుక బోన్లను, గమ్ ప్యాడ్‌లను ఏర్పాటు చేయడంతో సోమవారం ఉదయానికి రెండు ఎలుకలు పట్టుబడ్డాయి. వైద్య విద్యార్థినులపై ఎలుకల దాడి ఘటనకు సంబంధించి విద్యార్థినుల వసతి గృహ అధికారులకు సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెంటనే స్పందించి విచారణకు ఆదేశించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు.ఈ నేపథ్యంలో బాలిక వసతి గృహ అధికారిణి, ఇద్దరు సహ వసతి గృహ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పర్యవేక్షించాలని ఆదేశించామన్నారు.ఎలుకల కట్టడికి సంబంధించి అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

దాడి చేసిన తొమ్మిది మంది అరెస్టు


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీవేద

యలమంచిలి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్యపేట గ్రామంలో ఈ నెల 8న రాత్రి విధులు నిర్వహించడానికి వెళ్లిన హోంగార్డు దిగమర్తి సత్యనారాయణపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి వారిని అదుపులోకి తీసుకున్నట్టు నరసాపురం డీఎస్పీ జి.శ్రీవేద తెలిపారు. యలమంచిలి పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నిందితుల వివరాలను వెల్లడించారు. ఈ నెల 8వ తేదీ రాత్రి ఆర్యపేట గ్రామం పెదపేట ప్రధాన రహదారిపై కొంత మంది వ్యక్తులు బహిరంగంగా మద్యం తాగుతూ న్యూసెన్స్ చేస్తున్నారని స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సమాచారం మేరకు హోంగార్డు దిగమర్తి సత్యనారాయణ ఘటనాస్థలానికి వెళ్లగా 9 మంది వ్యక్తులు హోంగార్డును తిట్టి, అతని సెల్ ఫోన్ లాక్కుని, దాడి చేశారని డీఎస్పీ తెలిపారు. దీనిపై హోంగార్డు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. నిందితులను నరసాపురం కోర్టుకు హాజరుపరుస్తున్నామని డీఎస్పీ తెలిపారు. సీఐ జి.శ్రీనివాస్, ఎస్ఐ కె.గుర్రయ్య ఉన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

ఇరగవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రబీలో యూరియా కొరత లేకుండా చూడాలని మార్టేరు ఏడీఏ రమేష్ తెలిపారు. కంతేరు, కత్తవపాడు, కొత్తపాడు సొసైటీల్లో ఎరువుల స్టాక్ రిజిష్టర్లను ఆయన సోమవారం పరిశీలించారు. రైతు ఆధార్ నెంబర్, వేలిముద్ర లేకుండా యూరియా అమ్మకాలు చేయకూడదన్నారు. స్టాక్ రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించాలని వ్యాపారులకు సూచించారు. మండల వ్యవసాయ అధికారి వై రామవేంద్రరావు పాల్గొన్నారు.

కవి అందెశ్రీ మృతికి సంతాపం

పాలకొల్లు అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇటీవల మరణించిన ప్రముఖ కవి అందెశ్రీకి పలువురు నివాళులర్పించారు. మహాకవిగా పేరొందిన అందెశ్రీ మరణం సాహితీ లోకానికి తీరని లోటన్నారు. జాతీయ తెలుగు సారస్వత పరిషత్ గౌరవ సలహాదారు, మాజీ ఎంపీ చేగొండి వెంకట హరిరామజోగయ్య, గౌరవాధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, సభ్యులు కేశిరాజు రాంప్రసాద్, సంతాపం తెలిపారు.

క్షీరారామం బేడా మండపం ప్రహరీ పరిశీలన

పాలకొల్లు అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయం పడమర వైపు బేడా మండపానికి ఆనుకుని ఉన్న ప్రహరీ ఆదివారం కొంత మేర పాక్షికంగా కూలింది. పురావస్తు శాఖ ఏడీ కె.తిమ్మరాజు సోమవారం పరిశీలించారు. బేడ మండపానికి ఏవిధమైన ఇబ్బంది లేదని, అడుసు, ఇటుకలతో నిర్మించిన ప్రహరీ మండపం కన్నా ఎత్తుగా ఉన్నందున భక్తులకు అసౌకర్యం కలగ కుండా బేడా మండపంలో ప్రదక్షణాలు నిలిపివేయించామని, కార్తీక మాసం సందర్భంగా ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రహరీ గోడ నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

అన్నదానాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయం వద్ద భీమవరం మోటార్ లారీ ఓనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదానాన్ని ఎమ్మెల్యే పులపర్తి అంజి బాబు సోమవారం ప్రారంభించారు. ముందుగా స్వామివారికి పూజలు చేసుకుని సమరాధన చేశారు. సభ్యులు కాశీరాజు, సూరిబాబు, వర్మ, రవిరాజు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, త్రినాద్, బాబు, అప్పారావు, అన్నవరం, శ్రీను, ఆలయ ఇవో డి రామకృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడు గుడిలో ఏకాహం

పెనుగొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కెనాల్ రోడ్డులో గల ప్రసిద్ధి శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం శివ ఏకాహ 49వ వార్షికోత్సవ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం నుంచి భక్తిసంకీర్తనల కార్యక్రమం నిర్వహించనున్నారు. భజన సంకీర్తనల కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల భక్తి భజన సంఘాలు పాల్గొంటాయన్నారు.

వాసవి ధామ్‌లో రుద్రహోమం

పెనుగొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పెనుగొండ వాసవి ధామ్‌లో సోమవారం కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన భక్తులతో కార్తీక సోమవారం పురస్కరించుకుని వేడుకగా రుద్రహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఖోఖో జిల్లా జట్టుకు ఎన్ఆర్‌పి అగ్రహారం విద్యార్థులు



ఖోఖో జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు

ఉండి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అండర్-14, 17 ఖోఖో జిల్లా జట్టుకు ఎన్ఆర్‌పి అగ్రహారం హైస్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. గోపన్నపాలెం వ్యాయామ విద్యా కళాశాలలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో అండర్-14 విభాగంలో గోకవరపు మోహన్, కర్రి సాయిశ్రీ అంజిలీదేవి, అండర్ 17 విభాగాలలో పాలవలస సురేఖ ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. విద్యార్థులను అభినందించారు. పీఈటీ కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో మాంటిస్సోరి విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులు

తణుకు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీలలో తమ విద్యార్థులు పతకాలు సాధించినట్లు మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు, హెచ్‌ఎం లక్ష్మి సోమవారం తెలిపారు. ఈనెల 6న విశాఖ పట్టణంలో అంతర జిల్లా స్టేట్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో తమ విద్యార్థులు గూడూరి వేణుగోపాల్, గంటి జశ్వంత్ రజత, భోగా మోక్షిత, మోయిత్రీ దాస్, పొట్ల అమూల్య, పతకాలు సాధించినట్లు వివరించారు.

17 వేల ఇళ్లు రద్దు

5వ పేజీ తరువాయి

ప్రభుత్వానికి నివేదిక ఇస్తూనే ఉన్నారు. ప్రతినెలా లక్ష్యాలను చేరుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. కేంద్రానికి కూడా ప్రభుత్వం నివేదిక సమర్పిస్తోంది. ఫలితంగానే ప్రధానమంత్రి ఆవాస యోజన 2.0 ఇళ్లను కేటాయించారు. తొలుత పట్టణాలకు ఇళ్లు మంజూరు చేశారు.

పరిశీలించాకే బిల్లులు

ప్రధానమంత్రి ఆవాస యోజన 2.0లో జిల్లాలోని అన్ని పట్టణాలకు 595 ఇళ్లు మంజూరు చేశారు. స్థలం ఉన్న లబ్ధిదారులందరికీ ఇళ్లు మంజూరయ్యాయి. నిర్మాణాలు ప్రారంభించారు. గతంలో ఇంటికి రూ.1.80 లక్షలు మాత్రమే ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో రూ.2.50 లక్షల ఇస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం రూ. 1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 1 లక్ష ఇస్తోంది. నిర్మాణాలను పరిశీలించిన తర్వాతే విడతలవారీగా బిల్లులు మంజూరు చేయనున్నారు. ప్రభుత్వం దీనిపై స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది.

పాడి సంపద అధరహో !

5వ పేజీ తరువాయి

నిత్యావసర వస్తువు కావడంతో ఆదాయం నికరంగా మారింది. ఒక రైతు రెండు పశువులను పెంచుతూ రోజుకు సరాసరి 12 లీటర్లు వరకు ఉత్పత్తి చేస్తున్నాడు. వాటిని పట్టణాల్లో ఇళ్లకు వెళ్లి అందిస్తున్నారు. ఇలా నెలకు రూ.36 వేల దాకా ఆదాయం వస్తుంది. అందులో దాణాకు రూ. 2400, ట్రాన్స్‌పోర్టుకి రూ. 2 వేలు, ఇతర ఖర్చులుగా రూ. 1600 మొత్తం 6 వేలు పోయినా రూ. 30 వేలు మిగులు కనిపిస్తుంది.

పశువుల పెంపకం భారమే

పశువుల పెంపకం గతంలోలా లేదు. భారంగా మారింది. మొదట పాడి పశువుల ధర బాగా పెరిగింది. 15 ఏళ్ల క్రితం రూ. 30 వేలు ఉన్న పాడి గేదె ఇప్పుడు లక్ష పైనే ఉంటున్నది. దాణా ధరలు కూడా రెట్టింపు అయ్యాయి. ప్రొటీన్స్ దాణా 50 కేజీలు రూ. 600 నుంచి రూ. 1200లకు చేరింది. ఎండుగడ్డి ఉచితంగా అందేది. అది ట్రక్కు గడ్డి రూ. 10 వేలు పెట్టి కొనాల్సి వస్తున్నది. ఇలా పశువుల పెంపకం ఖర్చులు బాగా పెరిగాయి. అయినప్పటికీ పాలు గిరాకీ, ధరలు బాగుండడంతో రైతులకు ఆసక్తి కనబరుస్తున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది

పశువుల పెంపకం రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తున్నదిది. గత 6 నెలలుగా ఆర్ఎస్‌కేలలో 50 శాతం సబ్సిడీతో దాణా అందుబాటులోకి వచ్చింది. పశు వైద్యశాల మొబైల్ వైద్య సేవలు పశువులకు బీమా సౌకర్యాలు వచ్చాయి. ఉచితంగా వైద్యం సేవలతో పాటు ఇంజక్షన్లు చేస్తున్నారు. గ్రామానికి ఒక పశు వైద్యుడు అందుబాటులో ఉన్నారు. పాలు కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి ప్రభుత్వం తెచ్చింది.



ఆదాయ వనరుగా మారింది

పాలు ధర పెరిగింది. లీటరుకు రూ.100 ఇస్తున్నారు. దానివల్ల పశువుల పెంపకం ఆదాయంగా మారింది. మంచి జాతి గేదెలు రోజుకు 8 లీటర్లు పైన పాలు ఇస్తున్నాయి. ఇంటిలో ఉపయోగించి మిగిలినవి అమ్మినా నెలకు రూ. 15 వేలు పైనే ఆదాయం ఉంటుంది. వ్యవసాయం చేస్తూ గేదెను మేపుకుంటూ పాలు నుంచి ఆదాయం రాబడుతున్నాను.

- ఎం.పెంటయ్య రైతు, భీమవరం మండలం



స్వచ్ఛమైన పాలతో ఆరోగ్యం

చాలా మందికి పాలు వాడకం అవసరం. పాలు తాగడం వల్ల కాల్షియం పెరుగుతుంది.ఎముకలు పటిష్టంగా ఉంటాయి. మధ్యాహ్నం పెరుగు తినడం వల్ల ప్రొటీన్స్ లభిస్తాయి. అయితే స్వచ్ఛమైన పాలు తాగాలి. పిల్లలకు కూడా పాలు మంచిది.

- దుర్గాప్రసాద్, తణుకు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు



నరసాపురం గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు





ఆకివీడులో భీమేశ్వరస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణలో జుత్తిగ సోమేశ్వరుడు



గునుపూడి సోమేశ్వరాలయంలో భక్తుల రద్దీ

శంభో శంకర

భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు



గొల్లలకోడేరు సంజన ఎస్టేట్స్‌లో కోటి దీపోత్సవం



వేల్పూరు శివాలయంలో పూజా కార్యక్రమాల్లో భక్తులు

నరసాపురం టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణ, మండలంలో కార్తీక శోభ నెలకొంది. మూడో సోమవారం భక్తులు పుణ్యస్నానాలు అచరించేందుకు వశిష్ఠ గోదావరికి తరలివచ్చారు. తెల్లవారుజామున స్నానాలు చేసి గట్టు వద్ద నోములు నోచుకున్నారు. కార్తీక దీపాలను గోదావరిలో విడిచిపెట్టారు. శివాలయం, అమరేశ్వర, ఏకాంబేశ్వర, మండలంలోని లక్ష్మణేశ్వరస్వామి ఆలయాల్లో శివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి శివాలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు.

ఆకివీడు: శైవక్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. మాదివాడ మల్లేశ్వర స్వామి, వాడపల్లివీధిలో అగస్త్యేశ్వరస్వామి, సాలిపేట కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ సహిత భద్రకాళీ సమేత వీరభద్రస్వామి, రెడ్డివీధిలో మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి(పాత శివాలయం), పిల్లలమర్రి అగ్రహారంలోని పార్వతీ సమేత వెంకట లింగేశ్వరస్వామి, జవహర్‌పేటలోని రాజరాజేశ్వరీ సహిత మార్కండేయేశ్వరస్వామి, ధర్మాపురం అగ్రహారం శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాదివాడ మల్లేశ్వరాలయంలో లక్ష దీపార్చన నిర్వహించారు.

పెనుగొండ: సిద్ధాంతం గోదావరి కేదార్‌ఘాట్‌లో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి అరటి డొప్పలతో నదిలో దీపాలు వదిలారు. కేదారేశ్వర స్వామిని దర్శించడానికి ఆలయం వద్ద భక్తులు పోటెత్తారు. వేకువజామునే భక్తులు కాలువలు, గోదావరి, చెరువులలో కార్తీక దీపాలు వెలిగించారు.

తణుకు రూరల్: రూరల్ మండలం వేల్పూరు రుద్రేశ్వర, వీరభద్రేశ్వ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో మహాన్యాసక ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన నిర్వహించారు. పార్వతీదేవి అమ్మవారికి లక్ష కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. సూర్య నమస్కారాలు, జ్యోతిర్లింగార్చన, రుద్ర హోమం, సాయంత్ర స్వామి వారికి శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఆలయ ఈవో పి.సూర్యనారాయణ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. మండలంలోని శివాలయాల్లో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేల్పూరు, మండపాక, పైడిపర్రు, దువ్వ, తేతలి, కోనాల తదితర గ్రామాల్లోని శివాలయాల్లో కార్తీక పూజలు నిర్వహించారు.

మొగల్తూరు: మండలంలోని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. మొగల్తూరు వడయార్‌పేట లింగేశ్వర వనమల్లికార్జునుడికి భక్తులు అభిషేకాలు చేశారు. మొగల్తూరులోని పురాతన పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయం, ముత్యాలపల్లి భువనేశ్వరీ సమేత ముక్తేశ్వరస్వామి ఆలయం, కాళీపట్నంలోని భద్రకాళీ సమేత కాళికేశ్వరస్వామి ఆలయం, ముత్యాలపల్లి, పేరుపాలెం గ్రామాల్లోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయాల్లో వేకువ జాము నుండే భక్తులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెనుమంట్ర: జుత్తిగ ఉమా వాసుకి రవి సోమేశ్వరస్వామికి ఆలయ అర్చకులు వాసు శర్మ, సాయి గణేశ్ శర్మ ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రాభిషేకాలు, పార్వతీ దేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. స్వామివారిని పుష్పాలు, మారేడు దళాలతో అలంకరించారు.

గొల్లలకోడేరులో కోటి దీపోత్సవం

పాలకోడేరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గొల్లలకోడేరు సంజన ఎస్టేట్‌లో 1200 మంది మహిళలతో నిర్వహించిన దీపోత్సవం అలరించింది. ప్రత్యేక పూజలు, దీపాల వెలుగులతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఎస్టేట్‌లో ఉన్న కృష్ణంరాజు, గోపీరాజు, రామలింగరాజు, రాఘవరాజు, వి.సత్యనారాయణరాజు, టి.శ్రీనివాసవర్మ తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన కోటి దీపాల కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అరుణాచలం ప్రాంతం నుంచి వచ్చిన మాధవి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పీఎంశ్రీ నిధులు సక్రమంగా వినియోగించండి

పెనుమంట్ర, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వేణుగోపాల జడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అదనపు కోఆర్డినేటర్ పి.శ్యామ సుందర్ సోమవారం తనిఖీ చేశారు. పాఠశాలలో సమ్మేటివ్ పరీక్షలను పరిశీలించారు. స్కూలు రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేసి పాఠశాలకు పీఎంశ్రీ పథకం నిధులను సక్రమంగా ఖర్చు చేయాలని సూచించారు. ఎంఈవో నాగేశ్వరరావు, హెచ్‌ఎం కట్ట మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు వెంకట నరేంద్ర, త్రివేణి, నరసింహారెడ్డి, సతీష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సూర్యనారాయణ రాజుకు పలువురి నివాళి

భీమవరం టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ తండ్రి సూర్యనారాయణరాజు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు సోమవారం నివాళులర్పించారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎంపీ పాకా వెంకటసత్యనారాయణ, ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు, ఎస్పీ అద్నాన్ నయీం ఆస్మి, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, వలవల బాబ్జీ, మంతెన రామరాజు, పీతల సుజాత, చాగంటి మురళీకృష్ణ, అయినంపూడి శ్రీదేవి, చైతన్యరాజు, బండారు మాధవనాయుడు, జుత్తుగ నాగరాజు, ఆర్‌డీవో దాసి రాజు, తదితరులు నివాళులర్పించారు.

సినీనటుడు జోష్ రవికి పితృ వియోగం



నాని పంతులు (ఫైల్)

పెనుమంట్ర, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మార్టేరుకు చెందిన సినీ నటుడు జోష్ రవి తండ్రి, ప్రముఖ పురోహితులు వడగం నాని పంతులు (66) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. పౌరోహిత్యంలో పరిసర గ్రామాల్లో మంచిపేరు తెచ్చుక్కున్న నాని పంతులకు పలువురు గ్రామస్థులు ఇల్లు కట్టించారు. ఒక కుమారుడు వడగం రవి తెలుగు సినిమాల్లో జోష్ రవిగా గుర్తింపు పొందారు. నాని పంతులు మృతికి పంచ గ్రామాల్లోని పలువురు సంతాపం తెలిపారు.


పాలకోడేరులో కార్తీక వన సమారాధన

పాలకోడేరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గౌడ కులస్తులు ఐకమత్యంగా ఉండాలని, నలుగురికి సహాయం చేయాలిన పాకా సత్యనారాయణ అన్నారు. పాలకోడేరులో గౌడ సంఘ ఆధ్వర్యంలో సోమవారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పాకా సత్యనారాయణ, గూడూరి ఉమాబాల, మేకా శేషుబాబు, డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కునాథరాజు మురళీకృష్ణంరాజు, పాలకోడేరు సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు కొత్తపల్లి నాగరాజు, సర్పంచ్ ఇంజేటి మరియమ్మ, కామన నాగేశ్వరరావు, కట్టా నాగరాజు, వేండ్ర శ్రీను, చెల్లబోయిన పాపారావు తదితరులు పాల్గొన్నారు. ప్రయాణికుల విశ్రాంతి భవనం, గౌడ సంఘ కమ్యూనిటీ భవనాన్ని పాకా సత్యనారాయణ, కొత్తపల్లి నాగరాజు, మురళీకృష్ణంరాజులు ప్రారంభించారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించారు.

కాళ్లకూరులో కార్తీక వన సమారాధన

కాళ్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్తీక వన సమారాధన కార్యక్రమాలు ప్రజల్లో ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని దాట్ల వెంకట రామరాజు అన్నారు. కాళ్లకూరు భీమేశ్వరస్వామి ఆలయంలో దాట్ల శ్రీదేవి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. మరో మూడు సోమవారాలు దాతల సహకారంతో అన్నసమారాధన నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. గోకరాజు వెంకట శివరామరాజు, దండు ప్రణవమూర్తి రాజు, అడ్డాల నాగరాజు, చేకూరి పుల్లంరాజు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



ఉపకరణాలు అందజేస్తున్న జడ్పీటీసీ, ఎంపీపీ

ఆచంట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నియోజకవర్గ స్థాయిలో ఉచిత ఉపకరణాల పంపిణీకి వైకల్య నిర్ధారణ శిబిరం సోమవారం నిర్వహించారు. కలకత్తా ఆల్‌మికో సంస్థ నుంచి నిపుణులు హాజరై కంటి వినికిడి లోపం, మేధా వైకల్యం, వివిధ రకాల విద్యార్థులకు ఉపకరణాలు అవసరమని గుర్తించారు. జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ దివ్యాంగులను ఆదరించాలన్నారు. గతంలో గుర్తించిన బుద్ధిమాంద్యం గల దివ్యాంగ విద్యార్థులకు ఎంఆర్‌పీఎల్‌ఎం కిట్‌లు అందజేశారు. ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, ఎస్ఎస్ఏ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పి.శ్యామ సుందర్, ఎంఈవోలు సీహెచ్ శ్రీనివాసరావు, పి.రాజేంద్ర ప్రసాద్, పి.శ్రీనివాస్, తాళం శ్రీనివాసు, కేతా మీరయ్య, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణా యాదవ సంఘం పట్టణ అధ్యక్షుడిగా శ్రీను

భీమవరం టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడిగా కొండ్రు శ్రీనివాస్, కార్యదర్శులుగా గోరిపర్తి త్రినాథ్, కిలారి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బైపాస్ రోడ్డులోని కృష్ణ దేవాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా అధ్యక్షుడు గొలగాని సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు గోరిపర్తి సత్యనారాయణ, ఎంవీ.అప్పాజి, నమ్మి రామకృష్ణ, గండమాని శివరాం, కందుల హనుమ, పెద్దిరాజు, గొలగాని నరసింహరావు, వెంకటేశ్వర్లు, యలమంచిలి శ్రీను, కర్రి ప్రసాద్, తదితరులు ఉన్నారు.

రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలి

భీమవరం టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను, కౌలు రైతులను, చేనేత కుటుంబాలను తక్షణమే ఆదుకోవాలని సీపీఐ జిల్లాకార్యదర్శి కోనాల భీమారావు కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ నాగరాణికి వినతి పత్రాన్ని అందించారు. తుపాన్ కారణంగా నష్టపోయిన ఆహార పంటలకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.50వేలు, పరిహారం ఇవ్వాలని కోరారు. చేనేత కార్మికులకు నిత్యావసర వస్తువులు అందలేదని మరోసారి ఎన్యూమరేషన్ జరిపి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఎం సీతారామప్రసాద్, మల్లుల శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

గ్రామ బహిష్కరణ చేశారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు

భీమవరం టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కులాంతర వివాహం చేసుకున్నందున తమ కుటుంబంపై గ్రామ బహిష్కరణ చేసి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాకల గరువు గ్రామానికి చెందిన వాతాడి ధనుంజయరావు ఆరోపించారు. పీజీఆర్ఎస్‌లో సోమవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కలెక్టర్ నాగరాణికి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర కుమార్, తదితరులు ఉన్నారు.

పది రోజుల నుంచి తాగునీరు లేదు

ఆకివీడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని పెదపేటలో పది రోజుల నుంచి తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోయారు. ఇంజనీరింగ్ ఏఈ విజయ్‌కుమార్‌ను సోమవారం కలిసి నీటి కోసం ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్య పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామన్నారు. భుజబలరాయుడు మంచినీటి చెరువు దగ్గర ఫిల్టర్ బెడ్‌ల్లో ఇసుక మార్చడం జరుగుతుందని, తాగునీరు వచ్చేలా చర్యలు చేపడతామని ఏఈ హామీ ఇచ్చారు.

ఫీల్డ్ ఎఫెక్ట్ ట్రాన్సిస్టర్లలో సెమీ కండక్టర్లు కీలకం


తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఫీల్డ్ ఎఫెక్ట్ ట్రాన్సిస్టర్లలో సెమీ కండక్టర్లు కీలకపాత్ర పోషిస్తాయని హైదరాబాద్ ఐఐటీ ఆచార్యులు డాక్టర్ సురేష్‌కుమార్ అన్నారు. తాడేపల్లిగూడెం ఏపి నిట్‌లో మెకానికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ మెటలర్జికల్ ఇంజనీరింగ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఏఎన్ఆర్ఎఫ్ పీఏఐఆర్ అంశంపై సోమవారం గెస్ట్ లెక్చరర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రింటింగ్, ఎలక్ట్రానిక్ పరికరాలను విద్యాసంస్థలు, పరిశ్రమలు ఎక్కువగా వినియోగిస్తున్నాయన్నారు. డాక్టర్ నరేంద్ర మాట్లాడుతూ మానవాళికి అవసరమైన విద్యుత్ శక్తి సౌర, పవన, మయోమాస్ వంటి వనరుల నుంచి పొందవచ్చన్నారు. డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ జి.రవికిరణ్ శాస్త్రి, కార్తికేయ, సంతోష్‌బెహ్రో, డీన్ వీరేశ్‌రుమార్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యాన వర్సిటీలో సీపీ బ్రౌన్ జయంతి

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఆవరణలో సీపీ బ్రౌన్ జయంతి సోమవారం నిర్వహించారు. విశ్వవిద్యాలయ డైరెక్టర్ పి.గోవింద రాజులు, సిబ్బంది సీపీ బ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీ బ్రౌన్ తెలుగు భాష అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ హార్టికల్చర్ మాధవి, డీన్‌ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్స్ సూర్యకుమారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తణుకు: సీపీ.బ్రౌన్ తెలుగు బాషా సంరక్షణ, వ్యాకరణ నిర్మాణం నిఘంటు రచనల ద్వారా భాషను ప్రజల మధ్య నిలబెట్టారని చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ సీహెచ్.ఏడుకొండలు అన్నారు. కళాశాలలో సోమవారం సీపీ.బ్రౌన్ జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో తెలుగు అధ్యాపకురాలు టి.సంధ్యారాణి మాట్లాడుతూ ఆంగ్ల, తెలుగు భాషల మధ్య సాంస్కృతిక వారధిగా నిలిచారన్నారు. అనంతరం విద్యార్థులు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఎస్ఎల్.పద్మశ్రీ, జి.కమల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మన్నె రమేష్

పెనుగొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నడిపూడి పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి మన్నె రమేష్ అన్నారు. నడిపూడిలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అనుమతులు లేకుండా మురుగు బోదెలు, పారిశుధ్య పనులు చేయించారన్నారు. ఇంటి పన్నులలో సుమారు రూ.6 లక్షలు, కుళాయి పన్నులలో సుమారు రూ.2 లక్షలు మాయం చేశారన్నారు. పంచాయతీ సొమ్ములు సర్పంచ్ కుటుంబ సభ్యుల ఖాతాకు జమ చేసుకుని వాడుకుంటున్నారన్నారు. చేపల చెరువు లీజు సొమ్ము చెల్లించడానికి లబ్ధిదారుడు పంచాయతీకి తెచ్చిన సొమ్ములు సైతం సర్పంచ్ కుమారుడు సొంతానికి వాడుకున్నాడన్నారు. ఇంత జరుగుతున్న ఏ విధమైన చర్యలు లేకపోవడంతో గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. సమావేశంలో టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి, వార్డు సభ్యులు మన్నె రమేష్, టీడీపీ నియోకవర్గ వైద్య విభాగం కార్యదర్శి యాగాటి రామకృష్ణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాండ్రేకుల సత్యనారాయణ, కార్యదర్శి నెక్కంటి సురేష్ బాబు, ఎ.మురళీకృష్ణ, ఎస్.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది



కోనాలలో ట్రక్ షీట్ అందజేస్తున్న శివ

తణుకు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని తణుకు ఏఎంసీ చైర్మన్ కొండేటి శివ అన్నారు. మండలంలోని కోనాల, దువ్వ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు ధాన్యాన్ని అమ్ముకుని మద్దతు ధరను పొందాలని కోరారు. ధాన్యం మిల్లుకు చేరిన 48 గంటల్లోనే సొమ్ములు రైతుల ఖాతాలో సొమ్ము జమవుతుందని చెప్పా రు. ఏఎంసీ వైస్ చైర్మన్ వల్లూరి రామ్మోహన్ మాట్లాడారు. ఏడీఏ జి.నరేంద్ర, తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ, ఏవో కె.రాజేంద్రప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు ఆత్మకూరి రామకృష్ణ, జనసేన పార్టీ అధ్యక్షుడు వేణు, సొసైటీ అధ్యక్షుడు ఎం శ్రీనివాసరావు, బూరుగుపల్లి ఆనందరమేష్, చిటికెన సత్యనారాయణ, ఎంపీటీసీ సత్యనారాయణ, కట్టా సూర్యారావు, కూటమి నాయకులు, సిబ్బంది, ఏఎంసీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పద్మ బాధ్యతలు

నరసాపురం టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నరసాపురం పట్టణానికి చెందిన కొలిచిన పద్మ సోమవారం గొల్లపూడి కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కార్పొరేషన్ చైర్మన్ రాంప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ దొరబాబు ఆధ్వర్యంలో బోర్డు సమావేశం నిర్వహించారు. బాధ్యతలు చేపట్టిన పద్మను పలువురు అభినందించారు.

భీమవరం టౌన్: ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా భీమవరానికి చెందిన చెరుకుపల్లి సంతోష్ కుమార్ శర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రతీ పథకం పేద బ్రాహ్మణులకు అందేవిధంగా కృషి చేస్తానన్నారు. ప్రతీ కార్యకర్తకు టీడీపీ న్యాయం చేస్తుందన్నారు. తనకు పదవి రావడానికి సహకరించి ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

పరిష్కార వేదికలో ఒక ఫిర్యాదు

మొగల్తూరు. నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఒక ఫిర్యాదు అందినట్లు తహసీల్దార్ కె.రాజ్‌కిశోర్ తెలిపారు. మొగల్తూరు పంచాయతీ నక్కావారిపాలెంలో వర్మా మెరైన్ పరిశ్రమ నుంచి వదులుతున్న వ్యర్థాల నీరు చేలల్లోకి చేరడంతో చేలు మునిగినష్టపోతున్నామని పిల్లి శ్రీనివాస్ ఫిర్యాదు చేసినట్టు తహసీల్దార్ తెలిపారు. ఎంపీడీవో త్రిశూలపాణి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **నరసాపురం :** ప్రభుత్వానికి ప్రజలకు జర్నలిస్టులు వారధిలా పని చేయాలని ఎమ్మెల్యే నాయకర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రెస్‌క్లబ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పొత్తూరి రామరాజు, కొల్లు పెద్దిరాజు, ఆర్డీవో దాసిరాజు, ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, తహసీల్దార్ ఐవివి సత్యనారాయణ పాల్గొన్నారు.
- **నరసాపురం టౌన్:** సీతారాంపురం జే బీరా స్కూల్ మైదానంలో ఈ నెల 29న నియోజకవర్గ స్థాయి మాలల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. బ్రోచర్‌ను సంఘం నాయకులు విడుదల చేశారు.
- **వీరవాసరం (భీమవరం టౌన్):** రాయకుదురు అయ్యప్ప స్వామి దీక్ష మందిరంలో సోమవారం సామూహిక శ్రీలక్ష్మీ గణపతి హోమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
- **ఆకివీడు:** పేదవారికి విద్య, వైద్యం అందడం లేదని సీఐటీయూ జిల్లా నాయకులు జెఎన్వీ గోపాలన్ అన్నారు. సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు సుఖశాంతులతో వర్థిల్లాలి అంటే సోషలిజం మార్గమన్నారు. కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు ఉన్నారు.
- **కాళ్ల:** జువ్వలపాలెంలో డయాబెటిస్‌తో బాధపడుతూ కాలును కోల్పోయిన పొన్నపల్లి మల్లేశ్వరరావుకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 1,77,408 చెక్కును టీడీపీ మండల అధ్యక్షుడు ఆరేటి వెంకటరత్న ప్రసాద్, ఆకివీడు డీసీ చైర్మన్ గోకరాజు వెంకటశివరామరాజు సోమవారం అందించారు.
- **పాలకొల్లు:** బ్యాంక్ వీధిలోని పచ్చిపులుసు కాశీ విశ్వనాథం కుమారుడు మోహిత్ వెంకట సూర్య గుప్తకు ప్రమాదంలో కాలు విరగడంతో స్కూల్‌కు కూడా వెళ్లలేని పరిస్థితి. జైభీమ్ యువసేన ఫౌండేషన్ సభ్యులు సోమవారం విద్యార్థికి రూ.12వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈకార్యక్రమంలో సంస్థ సభ్యులు గెడ్డం సునీల్ గవాస్కర్, బుంగా సంసోన్, రావి అబ్రహం, వర్దనపు ప్రవీణ్ తదితరులు ఉన్నారు.
- **అత్తిలి:** వైద్య కళాశాలలను ప్రైవేటీకరించాలనే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఈనెల 12న తణుకులో నిర్వహించే ప్రజా ఉద్యమ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైసీపీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ కోరారు.
- **తణుకు:** ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుంచి ప్రారంభమవుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యు. లక్ష్మీ సుందరీబాయి తెలిపారు. సోమవారం ప్రకటన విడుదల చేశారు.
- **తాడేపల్లిగూడెం రూరల్:** జగన్నాథపురం మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. సత్యాల సతీష్ అరిగల వెంకట కృష్ణ, పాల్గొన్నారు. మాధవరం విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద అన్న సమారాధన తోట వెంకటేష్, పద్మావతి సహకారంతో నిర్వహించారు.